క్లుప్తంగా

మాతా,శిశు సంరక్షణ బాధ్యతాయుతమైనది..



మాతా,శిశు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సాలూరు: మాతా, శిశు సంరక్షణ ఎంతో బాధ్యతతో కూడిన వ్యవహారమని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకే రత్నకుమారి, గైనకాలజిస్ట్ డాక్టర్ మీనాక్షి అన్నారు. నూరా హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో మాతా,శిశు సంరక్షణ చర్యలపై శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, నర్సులు ఎంతో బాధ్యతతో మాతా, శిశురక్షణకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఏ సమయంలో ఏయే పరీక్షలు చేయించుకోవాలని.. సమతుల ఆహారం.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

పార్వతీపురం: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు పార్వతీపురంలోని సూర్య యోగా సెంటర్ విద్యార్థులు ఎంపికయ్యారని యోగా సెంటర్ వ్యవస్థాపకులు మోహన గంతాయత్ అన్నారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న సూర్యపీఠంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. సెంటర్ నుంచి దేవి, స్వాతి, రేవతి, హారిక, సాయిలక్ష్మి, చరణ్, గౌతమ్ తదితరులు ఎంపికయ్యారన్నారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు.

నేడు సచివాలయం, ఆర్‌బీకే భవనాల ప్రారంభం

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం ప్రారంభించనున్నట్టు మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరగనున్నట్టు పేర్కొన్నారు. మండలంలో కాశీపేట, వెంకటాపురం, తామరఖండి, పెద బోగిలి, పెదంకలాం, నిడగల్లు, గాదెలవలస గ్రామాల్లో కూడా సచివాలయ భవనాలు పూర్తయ్యాయని దశలవారీగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. గుచ్చిమిలో వెల్‌నెస్ కేంద్రం భవనం పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు.

జోరందుకున్న ఉభాలు



మక్కువ శివారులో నాట్లు వేస్తున్న మహిళలు

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా పంట పొలాలకు నీరు రావడంతో వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ నెల 3న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు వెంగళరాయసాగర్ నీటిని విడుదల చేశారు. శివారు గ్రామాలకు సాగునీరు చేరడంతో ఉభాలు జోరుగా సాగుతున్నాయి.

గిరిజన చట్టాలపై అవగాహన అవసరం



గిరిజన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయ సలహాదారు

పార్వతీపురం: గిరిజన చట్టాలపై గిరిజనులు అవగాహన కలిగి వుండాలని న్యాయ సలహాదారు డాక్టర్ పల్లా త్రినాధరావు అన్నారు. పట్టణంలోని గిరిజన భవనంలో గిరిజనులకు, గిరిజన సంఘ నాయకులకు న్యాయ అవగాహన సదస్సును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాల ఆవిర్భావం, బ్రిటీష్ పాలనలో వచ్చిన షెడ్యూల్ చట్టాలు, భూ బదలాయింపు చట్టాలు, ఆవాసాలు, తండాలు, పీసా వంటి చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ ఆదివాసీ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

త్యాగధనుల సేవలు మరువలేనివి

పాలకొండ రూరల్: దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగధనులు చేసిన సేవలు మరువలేనివని అట్టలి సర్పంచు కనుముల సంధ్యారాణి అన్నారు. పంచాయతీ పరిధిలో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధకు వందనం పేరిట గ్రామంలో మొక్కలు నాటారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి..

- ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి రాజన్నదొర

సాలూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సంక్షేమసారథి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన పట్టణంలోని గాంధీనగర్ -2 సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొర, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమపథకాలపై ఆరా తీశారు. అలాగే స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. వివిధ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించారని చెప్పారు. అత్యంత పారదర్శకంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, కౌన్సిలర్లు, నాయకులు గొర్లె జగన్, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరి రఘు, తదితరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

వార్డుల్లో సమస్యలకు సత్వర పరిష్కారం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



వార్డుల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: వార్డుల్లోని సమస్యల సత్వర పరిష్కారానికి నా అడుగు మీ కోసం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పట్టణంలోని కుసుమగుడి వీధి, రామాపురం కాలనీ, కొత్త వీధి ప్రాంతాలలో గల 29, 2వ వార్డులలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో గుర్తించిన పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు తన దృష్టికి తెచ్చిన స్థానిక ప్రజల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి సైతం అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు వార్డులను సందర్శించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే వరుసగా ఈ వార్డులో కార్యక్రమం నిర్వహించి సమస్యలను గుర్తించి వాటిని అధికారులు దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా శాశ్వత పరిష్కారానికి సైతం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాహితం కోరే ప్రజల కోసం నిరంతరం పని చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ ఛైర్మన్ చిందుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్ సభ్యులు యడ్ల త్రినాథ, మంత్రి ఉమామహేశ్వరి, రణభేరి చిన్నం నాయుడు, రణభేరి బంగారు నాయుడు, సువ్వాడ లావణ్య, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, మున్సిపల్ శానిటరీ ఉద్యోగులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక పెద్దలు, ప్రజలు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వీఆర్‌ఎస్ ఎడమ ప్రధాన స్పిల్‌వే వద్ద వెదురు కర్రలతో రక్షణగోడ

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ స్పిల్‌వే వద్ద గతంలో ఇనుమ గొట్టాలతో ఏర్పాటు చేసిన పైపులు పాడవ్వడంతో ఇరిగేషన్ అధికారులు వెదురుకర్రలను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో నీరు నిల్వ ఉన్నందున పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. స్పిల్‌వే వద్దే ఎక్కువగా ఫొటోలు తీసుకుంటుంటారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదని పలువరు హెచ్చరిస్తున్నారు. వెదురుకర్రలు విరిగితే నీటిలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి స్పిల్‌వే ఇనుప చువ్వలతో రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ కుటుంబానికి 'సంక్షేమం'



బలిజిపేటలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బలిజిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నవరత్నాలతో రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని తెలిపారు. గతంలో పాలించిన ప్రభుత్వాలు ఇటువంటి పథకాలను ప్రవేశపెట్టలేదని తెలిపారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటేనే ఈ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలకతీతంగా ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకం అందుతుందని దానిలో ప్రతిపక్ష పార్టీలకు చెందినవారు ఉన్నారని అది వారు ఆలోచించుకోవాలని హితవు పలికారు. గడప గడపనా ప్రభుత్వ పనితీరును వారికి తెలియపరుస్తూ, రాను న్న రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాలని, ఆయనను ఆశీర్వదించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ కుటుంబంలో అర్హులు ఉంటే వారికి పథకాలు అందే విధంగా చూడాలని అధికారులు, వలంటీర్లను, సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని స్థాని క నాయకులను కోరారు. గడపగడపన అందరి సమస్యలు పరిష్కరించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నా రు. కార్యక్రమంలో బలిజిపేట సర్పంచ్ రాఘులత, జడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, బి.జ్యోతీష్, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, బలిజిపేట ఉప సర్పంచ్ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు విజయ, కె.మోహనరావు, సుందరరావు, పాపారావు, జి.సత్యంనాయుడు, రవణ, జి.శ్రీనివాసరావు, జి.శంకర్, ఎ.పోలినాయుడు, పలు గ్రామాలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు కొటికిపెంటలో గడప గడపకు..

సాలూరు: పాచిపెంట మండలంలోని కొటికిపెంట పంచాయతీలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయవర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ కార్యక్రమంలో మంత్రి పీడిక రాజన్నదొర పాల్గొంటారని పేర్కొన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నాలుగు వార్డులకు నాలుగు నామినేషన్లు

సాలూరు: మండలంలో ఖాళీ అయిన వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించి నాలుగు నామినేషన్లు వచ్చాయని అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ, ఎంపీడీఓ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లేడువలస, పురోహితునివలస, పెదపథం, జీగిరాంలలో ఒక్కో వార్డుకు ఒక్కో నామినేషన్ వచ్చిందని పేర్కొన్నారు.

చురుగ్గా ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల సమీపంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ ఆదేశించారు. లచ్చయ్యపేటలో జరుగుతున్న ట్యాంక్ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్ లేకపోవడంతో కాలనీకి డైరెక్ట్ పంపింగ్ విధానం ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోందన్నారు. నిర్దేశించిన గడువులోగా ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలియపారు. ఆయన వెంట జెడ్పీటీసీ బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు సింహాచలం ఉన్నారు.

ఇళ్ల స్థలాల అప్పగింత

భామిని: మండలంలోని బత్తిలి మేజర్ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు శనివారం స్థలాలు కేటాయించారు. హౌసింగ్ డీఈఈ పి.మోహనరావు, ఎంపీడీఓ జి.చంద్రరావు, మండల సర్వేయర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కొలతలు వేసి స్థలాలు అప్పగించారు.

• వీరు మారరంతే....



ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రహదారులు నిర్మిస్తోంది. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉంది. అయితే చాలామంది అనాలోచిత నిర్ణయాల వల్ల రహదారులు త్వరగా పాడవుతున్నాయి. ప్రస్తుతం దమ్ములు జోరుగా జరుగుతున్నందున రైతులు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. అయితే ట్రాక్టర్ డ్రైవర్లు ఐరన్ వీల్స్‌తోనే రహదారులపై రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రహదారిపై గోతులేర్పడుతున్నాయి. ఐరన్ వీల్స్‌తో రాకపోకలు సాగించవద్దని, రోడ్లపైకి వస్తే ఫుల్ వీల్స్‌తో మాత్రమే రావాలని అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు, మరోపక్క ప్రజాప్రతినిధులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ చాలా మంది దమ్ము పూర్తయిన తర్వాత ఐరన్ వీల్స్‌తోనే ట్రాక్టర్లను నడుపుతూ రోడ్లను పాడుచేస్తున్నారు. మేళాపువలస వద్ద ఐరన్‌వీల్స్‌తో వస్తున్న ట్రాక్టర్ శనివారం సాక్షి కంటపడింది. - మక్కువ

సచివాలయ కన్వీనర్ల సమావేశం 16కు వాయిదా

బలిజిపేట: పార్వతీపురం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఈ నెల 14న జరగాల్సిన నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్ల సమావేశం ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసినట్టు ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నాయకులు, కన్వీనర్లు దీన్ని గమనించాలని కోరారు.

ప్రగతి పథంలో గిరి గ్రామాలు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన గ్రామాలు ప్రగతి పథంలో నడుస్తున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కిల్లాడ, తాడిపాయి, గాడిదపాయి, జయపురం, జయపురంగూడ, పొంగలంగూడ, చదునుగూడ, కుంకుంమానుగూడ తదితర గ్రామాల్లో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లుగా ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండే విధంగా అనేక పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక వసతులైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు, వరదగోడల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ఇంటిముంగిటకే తీసుకువచ్చిన ఘనత దేశం మొత్తంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 98 శాతంపైగా అమలు చేశారన్నారు. గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు చింతపండు, కొండచీపుర్లు, ఇతర అటవీ ఫలసాయాలన్నింటికీ జీసీసీ ద్వారా కనీస మద్దతు ధర కల్పించామన్నారు. పూర్తిస్థాయిలో విద్య, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీడీఓ సత్యం, ఏఎంసీ ఛైర్మన్ హెచ్.మోహనరావు, సర్పంచ్‌లు సరోజినమ్మ, వూయక సరస్వతి, వెంకునాయుడు, బి.లక్ష్మి, జె.సుందరమ్మ, ఎంపీటీసీలు కిల్లక గన్నెమ్మ, హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.రాము, రామారావు, కుమార్, కైలాసరావు, సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల సేవలు మరువలేం

సీతంపేట: దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాలుపంచుకున్న త్యాగధనుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని కిల్లాడలో శనివారం నాభూమి-నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు.

ఆలయ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: నూతన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, దాతల సహకారంతో తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి సమష్టిగా కృషిచేయాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఛైర్మన్ మర్రాపు సత్యనారాయణతో పాటు కమిటీ సభ్యులతో ఆలయ కార్యనిర్వహణ అధికారి బీఎల్ నగేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ.. తోటపల్లి ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు నూతన ధర్మకర్తల మండలి కృషిచేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించడంతో పాటు మహిళలకు 50 శాతం స్థానాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, స్థానిక సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, తోటపల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు డొల్లు పారినాయుడు, ద్వారపురెడ్డి ధనుంజయరావు, జయబాబు, కురుపాం జెడ్పీటీసీ ఎస్.పద్మావతి, ఎంపీపీ దానయ్య, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా..

ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఛైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన మర్రాపు సత్యనారాయణ అన్నారు. దాతల సహకారంతో భక్తులను ఆకర్షించేలా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఛైర్మన్‌తోపాటు ధర్మకర్తలుగా బోను వాగ్దేవి, మార్కొండ నారాయణమ్మ, నందివాడ కనకమహాలక్ష్మి, కునుమూరు సాగర్, బుడ్డేపు యిందుమతి, గంటేడ సింహాచలం, పల్ల పాపమ్మ, గౌరీశంకర్ పాత్రో, ఎక్స్అఫీసియో సభ్యులుగా వీవీ అప్పలాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

పసుపు సాగులో సస్యరక్షణ



పసుపు పంట (ఇన్‌సెట్లో) పేడాడ జయశ్రీ, హార్టికల్చర్ ఆఫీసర్, సీతంపేట

- ఆకుమచ్చ, ఆకుముడత తెగుళ్లపై అప్రమత్తం
- ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు

సీతంపేట: మన్యం పసుపుకు మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో సీతంపేట ఏజెన్సీలో విస్తృతంగా పసుపు పంట సాగుచేస్తున్నారు. ఇక్కడ లభించే పసుపు మంచి నాణ్యతతో ఉంటుంది. ఈ ఏడాది సుమారు 8 వేల ఎకరాల్లో పసుపు సాగులో ఉంది. ఈ సీజన్‌లో పంటను తెగుళ్లు ఆశిస్తుంటాయి. ప్రస్తుతం ఆకుమచ్చ, ఆకుమడత తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంది. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వలన తెగుళ్ల వ్యాప్తి చెందుతాయని స్థానిక హార్టికల్చర్ ఆఫీసర్ పేడాడ జయశ్రీ అంటున్నారు. ఎరువులు యాజమాన్యం, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై పసుపు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆకుమచ్చ తెగులు..

వర్షాలు ఎక్కువగా కురిసినపుడు రోజుల తరబడి పొలంలో నీరు నిల్వ ఉన్నప్పుడు ఈ తెగులు ఆశిస్తుంది. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులపై చిన్నచిన్న పసుపు రంగు చుక్కలు ఏర్పడి తర్వాత గోధుమ రంగు మచ్చలుగా మారతాయి. తెగులు ఎక్కువగా ఉంటే ఆకులు మాడిపోతాయి. దీని నివారణకు తెగులు సోకిన ఆకులను తొలగించి విడోమిల్ ఎమ్‌జెడ్ 3 గ్రాముల లీటరు నీటికి లేదా ట్రైకోడెర్మా విరిడి 8 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. రెండు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం...

పసుపులో నాణ్యమైన ఉత్పత్తులు అధిక దిగుబడులు సాధించాలంటే సమగ్రమైన ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలి. పసుపు నాణ్యతను పెంచాలంటే రసాయనక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను వినియోగించాలి. రసాయన ఎరువులతో పాటు వర్మీకంపోస్టును ఎకరానికి 4 టన్నుల చొప్పున వేస్తే నేల సారవంతమై దుంప పెరుగుదలకు సహకరిస్తుంది. పసుపు పంటకు ఎక్కువ పోషకాలు అవసరం ఉన్నందున ఎరువుల వినియోగం కూడా ఎక్కువగా ఉంటుంది. దుక్కిలో పశువుల ఎరువు 10 టన్నులు, వేపపిండి 200 కిలోలు, సూపర్ ఫాస్పేట్ 150 కిలోలు, పొటాష్ 25 కిలోలు వేయాలి. విత్తనం నాటిన 40 రోజులకు యూరియా 50 కిలోలు వేయాలి. 80 రోజులకు యూరియా 50 కిలోలు, పొటాష్ 25 కిలోలు, 200 కిలోలు వేపపిండి వేయాలి. 120 రోజులకు యూరియా 50 కిలోలు పోటాష్ 25 కిలోలు వేయాలి. ఈ విధంగా ఎరువులు వేసే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. తెగుళ్లను అరికట్టవచ్చు. పంటకు ఎరువులు ఉదయం పూట వేయకూడదు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకురావాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం మండలం గొరడ, పెంగవ, రాయగడ జమ్ము, వల్లాడ గ్రామాలకు చెందిన 40మంది రైతులు తోటపల్లిలోని ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పంటలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పారినాయుడు మాట్లాడుతూ.. నాబార్డు ఆర్థిక సహకారంతో దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భూసారం పెంచేందుకు సేంద్రియ ఎరువులైన జీవామృతం, పంచగవ్య, వర్మీ కంపోస్టు, కషాయాలు, ద్రావణాలు వంటివి తయారీ, వినియోగంపై రైతులకు శిక్షణ, అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఏడాది పొడవునా వివిధ రకాల పంటల సాగుకు అవసరమైన ప్రణాళికలను వివరించారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ

వీరఘట్టం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నవధాన్యాల కిట్లను 61 మంది రైతులకు శనివారం ఉచితంగా అందజేశారు. చిదిమి, నడిమికెల్ల, కడకెల్ల, చలివేంద్రి, దశుమంతపురం, వీరఘట్టం, కత్తులకవిటి, యు.వెంకటమ్మపేట, బూరుగ గ్రామాల్లో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు ఏఓ అధికారి జె.సౌజన్య తెలిపారు.